పల్లెల్లో 'స్థానిక' సందడి

- సమావేశాలతో నాయకులు బిజీబిజీ
- మూడేసి పేర్లతో ఆశావహుల జాబితా



ఇల్లెందురూరల్: పరిషత్ ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో పల్లెల్లో స్థానిక సందడి ప్రారంభమైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పట్టు నిలుపుకోవాలని, ఓటమి పాలైన బీఆర్ఎస్ తిరిగి పట్టు సాధించాలని, మూడు దశాబ్దాలపాటు మండలంలో తిరుగులేని ఆధిపత్యం కొనసాగించిన న్యూడెమొక్రసీ, ఆ పార్టీ విడిపోయిన మాస్‌లైన్ తిరిగి పట్టు సాధించేందుకు స్థానిక ఎన్నికలను వేదికగా చేసుకునే ప్రయత్నాలు ప్రారంభించాయి. మండలంలో ప్రధాన పార్టీలు స్థానిక ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుండటంతో పల్లెల్లో ఎన్నికల వేడి రాజుకుంది.

నాయకుల మంతనాలు..

ఇప్పటికే రిజర్వేషన్ ప్రక్రియ పూర్తికావడంతో ఆశావహుల జాబితా సిద్ధం చేసేందుకు నేతలు పల్లెబాట పడుతున్నారు. రిజర్వేషన్ల ప్రకారం గ్రామాలను పరిశీలిస్తున్నారు. ప్రతీ గ్రామంలో ఆయా పార్టీలకు చెందిన గ్రామస్థాయి నాయకులతో సమావేశాలు నిర్వహించి మంతనాలు సాగిస్తున్నారు. రిజర్వేషన్ పరిధిలో కేటాయించిన కేటగిరీ ప్రకారం ఎవరెవరు ఎన్నికలకు సమర్థులనే విషయంపై ఊహాగానాలు చేస్తున్నారు. పార్టీ అధిష్టానం ఆదేశం మేరకు ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నారు. ఆయా ప్రాంతాలలో ఎవరికీ ఎంత పట్టు ఉంది. ఆర్థిక, కుల, పార్టీ బలాలు వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. అంతర్గత సమావేశాలు నిర్వహించి గెలిచే సత్తా ఉన్న వారి వివరాలు సేకరిస్తున్నారు.

ఆశావహుల సంప్రదింపులు...

నిన్నమొన్నటి దాకా రిజర్వేషన్ల వైపు చూసిన ఆశావహులకు ప్రక్రియ ముగియడంతో మార్గం సులభమైంది. కొన్ని గ్రామాల్లో రిజర్వేషన్ ఆశావహులను నిరాశ పరిచినా కొన్ని గ్రామాల్లో వారికి అనుకూలంగా రావడంతో సంతోషిస్తున్నారు. గ్రామంలో ఏ నలుగురు ఒక దగ్గర చేరినా రిజర్వేషన్లపైనే చర్చిస్తున్నారు. ఈ క్రమంలో అన్నా.. ఈ సారికి సహకరించు.. వచ్చేసారికి నీకు సహకరిస్తా.. అంటూ సంప్రదింపులు ప్రారంభించారు.

మూడు పేర్లతో జాబితా...

మండలంలో ప్రధాన పార్టీలు పరిషత్ ఎన్నికల్లో ఆశావహులైన అభ్యర్థుల జాబితా సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యాయి. పరిషత్ ఎన్నికల్లో గెలిచినా రాజకీయంగా పెద్దగా ప్రయోజనం ఉండదని భావిస్తున్న కొందరు నేతలు ఎన్నికలకు దూరంగా ఉండే ప్రయత్నం చేస్తుండటం, మరికొందరు ఎన్నికల ఖర్చుకు భయపడి దూరంగా ఉండే ప్రయత్నం చేస్తున్నారు. ఈక్రమంలో అభ్యర్థుల ఎంపిక నేతలకు కత్తిమీద సాములా మారింది. దీంతో నాయకులు ఆశావహుల జాబితా రూపకల్పన చేస్తున్నా. ఒక పార్టీ నేరుగా కార్యకర్తల వద్దకు వెళ్లి సమావేశాలు నిర్వహించడం ద్వారా వారి అభిప్రాయం మేరకు జాబితా సిద్ధం చేస్తోంది. మరో పార్టీ ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం, సమర్థులైన వారితో నేరుగా చర్చలు జరిపి జాబితాలో పేర్లు చేర్చడంతో పాటు ముఖ్య నేతల సమావేశాలు నిర్వహిస్తూ అభ్యర్థుల తుది జాబితా, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై అంతర్గతంగా చర్చలు జరుపుతున్నారు. కొన్ని స్థానాలకు ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేసినట్లుగా ప్రచారం కూడా జరుగుతోంది.

కీలకంగా ఎంపీపీ, జెడ్పీటీసీ అభ్యర్థులు..

ప్రధాన పార్టీలు ఎంపీటీసీ ఆశావహుల కంటే ఎంపీపీ, జెడ్పీటీసీ అభ్యర్థుల ఎంపికకు సమాలోచనలు ముమ్మరం చేశారు. ఆయా స్థానాలకు అభ్యర్థులను పార్టీ నేతలే ఎంపిక చేసి వారితో చర్చలు జరుపుతున్నారు. గత ఎన్నికలను పరిశీలిస్తే సర్పంచ్ ఎన్నికల కంటే పరిషత్ ఎన్నికల్లో ఖర్చు కొంత అధికంగా ఉంటుంది. అంత ఖర్చును ఎంపీటీసీ బరిలో నిలిచే అభ్యర్థులు భరించే అవకాశం లేకపోవడంతో ఎంపీపీ, జెడ్పీటీసీ బరిలో నిలిచే అభ్యర్థులు కొంతైనా భరించేలా అభ్యర్థులను రంగంలో నిలిపేందుకు ప్రధాన పార్టీలు చర్చలు ముమ్మరం చేశారు.

క్లుప్తంగా

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఇల్లెందురూరల్: మండలంలోని పోచారంతండా గ్రామంలో మంగళవారం వేట వేంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయమే స్వామి వారికి అభిషేకం నిర్వహించి ఉత్సవ విగ్రహాలను పూలమాలలతో అలంకరించారు. భక్తులు స్వామివారికి పట్టు వస్త్రాలు అందజేశారు. స్వామి వారిని ముస్తాబు చేసిన వేదపండితులు వేదమంత్రోచ్ఛారణలతో కల్యాణ క్రతువు నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణం తిలకించి తరించారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఇన్‌చార్జ్‌గా నాగేశ్వరరావు



ఇల్లెందు: ఇల్లెందు పట్టణ ఆర్యవైశ్య కార్పొరేషన్ జిల్లా ఇన్‌చార్జ్‌గా ప్రొద్దుటూరి నాగేశ్వరరావును నియమించారు. ఈ మేరకు మంగళవారం ఇల్లెందులో నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత భద్రాద్రి జిల్లా ఇన్‌చార్జ్‌గా తనను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఆయన ఎన్నిక సంఘం నాయకులు ఎలుగూరి నగేష్‌కుమార్, చంద్రశేఖర్, కండె రమేష్, అర్వపల్లి రాధాకృష్ణ, అనుబాబు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై చర్యలు తీసుకోండి..

సుజాతనగర్: సుజాతనగర్ మండల కేంద్రంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని వెలికితీయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు బత్తుల వీరయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ వనం కృష్ణప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వీరయ్య మాట్లాడుతూ సింగభూపాలెం ప్రాజెక్టు నిర్మించే క్రమంలో ఏర్పాటు చేసిన 100 అడుగుల రోడ్డుతో పాటు, ధన్వంతరి కళాశాల ఎదురుగా 4.10 గుంటల ప్రభుత్వ భూమి కూడా ఆక్రమణకు గురైందని ఆరోపించారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని వెలికి తీసి అర్హులైన పేదలకు పంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మల్లెల ప్రసాద్, వేములపల్లి వెంకటరావు, కొండె కృష్ణ, మామిడాల సాంబశివరావు, వినిల్ కుమార్, ఉపేందర్, బాలు పాల్గొన్నారు.

చదువుపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న ఎస్సై హసీనా

ఇల్లెందురూరల్: భవిష్యత్‌లో ఉన్నతమైన జీవనం సాగించేందుకు విద్యార్థి దశలో చదువుపై శ్రద్ధ చూపాలని ఎస్సై హసీనా సూచించారు. సుభాష్‌నగర్ హైస్కూల్‌లో విద్యార్థి దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్ చదువులకు పాఠశాల విద్య పునాది అని, ఇక్కడ శ్రద్ధతో చదువుకుంటేనే పైచదువులను సులువుగా అధిగమించవచ్చని చెప్పారు. మంచి స్నేహితులను ఎంపిక చేసుకోవాలని, చెడు స్నేహాల వల్ల తాత్కాలిక ఆనందం కలిగినా భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. ఆకతాయిలు వేధించినా, మానసికంగా ఇబ్బంది పెట్టినా ఉపాధ్యాయుల ద్వారా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉమాశంకర్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచరూరల్: ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మారుమూల గిరిజన గ్రామాలు ఉల్వనూరు, చంద్రాలగూడెం, రేగులగూడెం, బంజర, లక్ష్మీదేవిపల్లి, నర్సింహసాగర్, మందేరకలపాడు, మొండికట్ట, కారెగట్టు, సారెకల్లు, యానంబైల్, రెడ్డిగూడెంలో మంగళవారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏజెన్సీ గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలన్నారు. ఈ సమావేశంలో బరపటి వాసు, యర్రంశెట్టి ముత్తయ్య, జాలే జానికి రెడ్డి, కొండం వెంకన్న, బాలినేని నాగేశ్వరరావు, వాసం మంగయ్య, జమ్ముల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ సర్క్యులర్ విడుదల

కొత్తగూడెంఅర్బన్: టీయూసీఐతో పాటు మిగతా అన్ని కార్మిక సంఘాలు సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు వారి కుటుంబాలకు వైద్య సేవలు అందించాలని విజ్ఞప్తి మేరకు మంగళవారం సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ విడుదల చేయడం శుభపరిణామమని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద ముందుగా కొత్తగూడెం సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఈ సేవలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇంకా సింగరేణిలో పండగలు, జాతీయ పండుగల సెలవులతో పాటు వారి వేతనాలు పెంచడానికి సింగరేణి యాజమాన్యం చొరవ చూపి కార్మికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రోజురోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచే విధంగా సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: పరిషత్ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు మంగళవారం ఒకరోజు ప్రిలిమినరీ శిక్షణ శిబిరం నిర్వహించారు. మాట్లాడుతూ.. నామినేషన్ల స్వీకరణ నుంచి అభ్యర్థుల తుది జాబితా ప్రకటించే వరకు ప్రతీ అంశాన్ని నిబంధనలకు లోబడి పరిశీలించి పూర్తి చేయాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో తుది గడువు కీలకంగా ఉంటుందని, ఈ విషయంలో నిబంధనలను అతిక్రమిస్తే వివాదాలకు అవకాశం ఉంటుందని చెప్పారు. నామినేషన్ల స్క్రూటినీ, అభ్యంతరాల స్వీకరణ, బీఫాం విషయంలో నిబంధనలను విధిగా పాటించాలని పేర్కొన్నారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి విజయ, ఎంపీఓ చిరంజీవి పాల్గొన్నారు.

స్థాయికి మించి వైద్యం చేయొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ సైదులు

టేకులపల్లి: గ్రామీణ వైద్యులు స్థాయికి మించి వైద్యం చేయరాదని కొత్తగూడెం జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సైదులు అన్నారు. మంగళవారం సులానగర్ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన మండలంలోని గ్రామీణ వైద్యుల సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ వైద్యుల అర్హతలు, ఎలాంటి వైద్యం చేయాలి, ఏది చేయకూడదో వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా గ్రామీణ వైద్యులు వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆశాడే సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి ఆశాలకు అవగాహన కల్పించారు. టేకులపల్లి మండలంలో డెంగీ జ్వరాలు తగ్గించడం, మలేరియా నివారణకు సూచనలు చేశారు. సులానగర్ పీహెచ్‌సీలో యాంటీ రేబిస్, యాంటీ స్నేక్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని చెప్పారు. అనంతరం పీహెచ్‌సీలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్లు, సీహెచ్ఓ పార్వతి, ఆరోగ్య విస్తరణాధికారి దేవా, లింగయ్య, పాయం శ్రీను, పీహెచ్ఎన్ చంద్రకళ, విజయ, వెంకటేశ్వర్లు, కౌసల్య ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏరియా వర్క్‌షాప్ తనిఖీ



సమీక్షిస్తున్న సింగరేణి అధికారులు

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా వర్క్ షాప్‌ను, టేకులపల్లిలో కొత్తగా నిర్మించిన 150 కిలోవాట్స్ రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టును సింగరేణి జీఎం వర్క్‌షాప్ అండ్ ఎనర్జిమెంట్ కార్పొరేట్ కె.శ్రీనివాస్‌లు మంగళవారం సందర్శించి తనిఖీ చేశారు. ఏరియా జీఎం కార్యాలయంలో జీఎం వీసం కృష్ణయ్యతో చర్చించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ తుకారాం, అధికారులు రవికుమార్, నాగరాజునాయక్, రామదాసు, వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాప్యం లేకుండా ఉద్యోగులకు సేవలు..

సింగరేణి ఇల్లెందు ఏరియాలో పని చేస్తున్న ఉద్యోగులు జాప్యం లేకుండా సేవలు అందించాలని డీజీఎం పర్సనల్ తుకారాం తెలిపారు. మంగళవారం జీఎం మీటింగ్ హాల్‌లో గనులు వివిధ విభాగాల మినిస్ట్రీయల్ స్టాఫ్‌తో సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు టెర్మినల్ బెనిఫిట్స్, గృహ రుణాల రాయితీ, కారుణ్య నియామకాలు, మెడికల్ బోర్డు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, బ్యాంకు ఇన్సూరెన్స్ పథకాలు, ఉద్యోగుల గైర్హాజరు అంశాలపై సమీక్షించారు.

ఈ సమావేశంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ శ్యాంప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారి అజయ్, సంక్షేమ అధికారి ఇక్బాల్ షరీఫ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టండి..



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

కొత్తగూడెంఅర్బన్: రామవరం సమీపంలోని గోధుమవాగు పక్కన ఉన్న శ్మశాన వాటికలో వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ్ నాయకులు మాట్లాడుతూ శ్మశాన వాటికలో మాంసపు దుకాణాల నుంచి వ్యర్థాలు వేస్తున్నారని, దీని వలన తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని, తద్వారా అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందన్నారు. దీపావళి పండుగ కూడా రాబోతున్న తరుణంలో వెంటనే వ్యర్థాలను తొలగించి, ఇకపై ఎవరూ వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మొగిలిపాక రవి, రామవరం ప్రజలు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ నాయకుల సమావేశం

ఇల్లెందురూరల్: పరిషత్ ఎన్నికల సందర్భంగా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకుల సమావేశాన్ని బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు పులి సైదులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల బరిలో నిలిచేందుకు అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



కొత్తగూడెంఅర్బన్ కార్పొరేషన్ కార్యాలయంలో..

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి ప్రధాన కార్యాలయంలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ, డైరక్టర్ (పి-పి) కే.వెంకటేశ్వర్లు, శాఖాధిపతులు, అధికారులు, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ జీవితంలో మార్పు అనేది సహజం అని బోయవాడైన రత్నాకరుడు (వాల్మీకి) దారిదోపిడీలు చేసే స్థాయి నుంచి రామాయణ ఇతిహాసం రచించి వాల్మీకి మహర్షిగా మార్పు చెందారని, దీనిని స్ఫూర్తిగా తీసుకొని అందరూ తమలో ఉన్న నైపుణ్యాలను వెలికితీసి, చెడుని వదిలి ఉన్నత స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. జీఎం(పర్సనల్) వెల్ఫేర్ – సీఎస్ఆర్ జీవీ కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఎంఓఏఐ అధ్యక్షుడు టి.లక్ష్మీపతి గౌడ్, గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) బ్రాంచ్ సెక్రటరీ ఎస్‌వీ రమణమూర్తి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్‌లో..

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో మంగళవారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. కమిషనర్ సుజాత వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాల్వంచ: స్థానిక కేటీపీఎస్ 5,6 దశల కర్మాగారంలో వాల్మీకి మహర్షి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీఈ ఎం.ప్రభాకర్‌రావు, ఎస్ఈలు శివరాంరెడ్డి, సత్యనారాయణ, ధర్మారావు, కృష్ణ, మోక్షవీర్, డీవైసీసీఏ రామారావు, ఎస్‌పీఎఫ్ ఆర్ఐ డి.కిరణ్, వెల్ఫేర్ ఆఫీసర్ భాగం రాధాకృష్ణ, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎల్‌వీ.సత్యనారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

టేకులపల్లి: ఆదికవి వాల్మీకి జయంతి వేడుకలు మంగళవారం టేకులపల్లి మండలం బోడు గ్రామంలో శ్రీ వాల్మీకి సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మీనుగు సురేష్, మురికి సత్యనారాయణ, క్యాగర్ల శ్రీనువాసు, హనుమంత్, మీనుగు జనార్దన్, మురికి వెంకటయ్య, వెంకన్న, శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.

కుమురంభీం పోరాటాన్ని కొనసాగిస్తాం..

జల్, జంగిల్, జమీన్ కోసం ఆదివాసీలను చైతన్య పరిచి కుమురంభీం చేసిన పోరాటాన్ని కొనసాగిస్తామని పలువురు నాయకులు పేర్కొన్నారు. మంగళవారం భీం 85వ వర్ధంతి సందర్భంగా పలుచోట్ల ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు బీఆర్ఎస్, ఆదివాసీ నాయకులు, కుల సంఘాలు, గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీల హక్కుల సాధన కోరం ఆయన చేసిన పోరాటాలను నాయకులు కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: మాట్లాడుతున్న రమణాల లక్ష్మయ్య



టేకులపల్లి: కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో...

సుదూరంగా పోలింగ్ కేంద్రాలు

- ఓటు వేయాలంటే ఐదు కిలోమీటర్లు నడవాల్సిందే..
- దగ్గరగా ఏర్పాటు చేయాలని వినతి



పోలింగ్ కేంద్రానికి నడిచి వెళ్తున్న కొయ్యగుంపు ఓటర్లు (ఫైల్)

పాల్వంచరూరల్: ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ఏజెన్సీ ప్రాంతంలో రెండు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తోందని ఓటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పాల్వంచ మండలంలో మొత్తం 57 పోలింగ్ కేంద్రాలు ఉండగా పురుషులు 13,972 మంది, మహిళలు 14, 947 మంది మొత్తం 28,921 మంది ఓటర్లు ఉన్నారు.

దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలు..

రేగులగూడెం పోలింగ్ స్టేషన్ పరిధిలో మామిడిగూడెం, రాళ్లచెలక గ్రామ ఓటర్లకు నాలుగు, ఐదు కిలోమీటర్లు దూరంలో పోలింగ్ కేంద్రం ఉంది. చంద్రాలగూడెం పోలింగ్ కేంద్రం పరిధిలో తుమ్మలగూడెం గ్రామాల ఓటర్లుకు ఒక్కటి, రెండు కిలోమీటర్ల దూరం. బంజర పోలింగ్ కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో చిరుతానిపాడు, పున్నం వెంకయ్య గుంపు కిలోమీటర్ దూరంలో ఉంది. వీరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు బంజరకు రావాల్సి ఉంటుంది. కొత్తూరుగుంపు, గంగదేవిగుప్ప, నర్సింహసాగర్, చింతగుప్ప గ్రామ ఓటర్లు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉల్వనూరుకు వెళ్లి ఓటుహక్కు వినియోగించుకుంటున్నారు. సారెకల్లు గ్రామ ఓటర్లు కిలోమీటరుపైన ఉన్న కారెగట్టు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేస్తున్నారు. రెడ్డిగూడెం శివారులో ఉన్న ఎస్టీ కాలనీ ఓటర్లు కిలోమీటరు దూరంలో ఉన్న రెడ్డిగూడెం పోలింగ్ కేంద్రానికి నడిచి వెళ్లి ఓటు వేస్తున్నారు. నర్సంపేట గ్రామ ఓటర్లు నాలుగు నుంచి ఐదుకిలోమీటర్ల దూరంలో ఉన్న పాండురంగాపురం గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి వెళితేనే ఓటు వేసేది. పూసలతండా, దేవిజ్యాతండా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలంటే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోడిపుంజులవాగులోని పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. బొజ్జాతండా ఓటర్లు రెండుకిలోమీటర్లు ఉన్న నాగారానికి వెళ్లి ఓటు వేయాలి. దంతలబోరులో ఉన్న పోలింగ్ కేంద్రానికి రెండుకిలోమీటర్ల దూరంలోఉన్న బంద్రుగొండ, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొయ్యగట్టులో ఓటర్లు ఉన్నారు. సోములగూడెం పోలింగ్ కేంద్రానికి కిలోమీటర్ దూరంలో కమ్మరిగూడెం ఓటర్లు ఉన్నారు.

సమీపంలో ఏర్పాటు చేయాలి..



దంతలబోరు స్కూల్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం వలన ఎర్రబోరు, గంగదేవిగుప్ప, సీతానాగారం ఓటర్లకు దూరభారంగా ఉంది. ఇలాగే పలు ప్రాంతాలకు రవాణా సౌకర్యం లేదు. ఐదు కిలోమీటర్ల నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. అధికారులు స్పందించి సమీపంలో ఏర్పాటు చేయాలి.

– తెల్లం మల్లేష్, గంగదేవిగుప్ప

దూరంగా ఉంటే ఇబ్బంది..



మండలంలో పలు పోలింగ్ కేంద్రాలు గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయడం వలన ఆయా గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యం లేక నడిచివెళ్లి ఓటు వేయాలంటే ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి పోలింగ్ కేంద్రాలను సమీపంలో ఏర్పాటు చేసి ఓటింగ్ శాతాన్ని పెంచాలి.

– రవి, మాజీఎంపీటీసీ, సారెకల్లు

నిబంధనల మేరకే ఏర్పాటు చేశాం..



ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం రెండువందల ఓటర్లు ఉండి అక్కడ ప్రభుత్వానికి చెందిన భవనం ఉంటేనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. భద్రత, ఇతర సౌకర్యాలు ఉంటేనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. గతంలో ఉన్న పోలింగ్ కేంద్రాలనే ఇప్పుడు నిర్వహిస్తున్నాం.

– కె.విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ, పాల్వంచ

న్యాయవ్యవస్థను దెబ్బతీసే కుట్ర



సూపర్‌బజార్(కొత్తగూడెం): నిరసన తెలుపుతున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి చేయడం అత్యంత అమానుషం అని జాతీయ ట్రేడ్ యూనియన్ నాయకులు గొల్లపల్లి దయానందరావు, రచయిత డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టి, దాడిని ఖండించారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అపరబాలు అల్లి శంకర్, గాంధీపదం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు చింతలచెరువు గోర్షమ్, ఏజెన్సీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్, ఉపాధ్యాయ ఉద్యమాల పోరాట నాయకుడు డి.సుధాకర్, బహుజన నాయకులు పురుషోత్తమరావు, అప్పారావు, సీతారాం, శంకరులు పాల్గొన్నారు. బహుజన సంఘాల ఆధ్వర్యంలో కొత్తగూడెం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండ్ర వెంకటేశ్వర్లు, బాలశౌరి, యర్రా కామేష్, శ్రీనివాస్, గుండా రమేష్ పాల్గొన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై మతోన్మాద ముసుగులో దాడిని భారతీయులు ఖండించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య అన్నారు. గవాయ్‌పై దాడిని నిరసిస్తూ సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పోస్టాఫీసు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, న్యాయవ్యవస్థకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో గనిగళ్ల వీరస్వామి, వాసిరెడ్డి మురళి, కె.రత్నకుమారి, గోనె మణి, మర్రి గోపి, మాచర్ల శ్రీనివాస్, పిడుగు శ్రీనివాస్, షహీన్, భాగ్యలక్ష్మి, కైసర్, కత్తెర రాములు, కె.ధర్మరాజు, గోనె సురేష్, గుత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి భారత రాజ్యాంగాన్ని అవమాన పరచడమేనని, దాడికి సీపీఎం ఖండిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి దాడులను భారతీయ పౌరులు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

కొత్తగూడెంటౌన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయమైన చర్య అని అందుకు కారణమైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని నిర్భయ ఆర్గనైజేషన్ ఫర్ ఉమెన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, న్యాయవాది మల్లెల ఉషారాణి అన్నారు. మంగళవారం రైటర్‌బస్తీలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యాక్రమంలో మునిలా రాజేశ్వరి, విజయలక్ష్మి, శిరీషా, రేణుక, సుశీల, సంధ్య రమ్య, అనుష తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: చీఫ్ జస్టిస్ గవాయ్‌పై మతోన్మాద దాడి హేయమైన చర్య అని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తడికల శివకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో కోళ్లపూడి ప్రవీణ్, ముత్యాలు, కొండగొర్ల రమేష్, అబ్దుల్ హమీద్, సర్వర్ మియా తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాల్వ ప్రకాష్‌రావు, భాస్కర్‌రావు, కొత్తపల్లి సోమయ్య, రాజేంద్ర కుమార్, దాసరి నాగేశ్వరరావు, దేవదాస్ పాల్గొన్నారు.